


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 30-06-2022 సంపుటి : 03 సంచిక : 276 పేజీలు : 4 వెల : రూ 3-00


## 'అధికారంలో మేమే ఉంటాం..అందుకే ప్రజా సమస్యలపై చర్చ'



గుంటూరు: వచ్చే నెల 8వ తేదీన నిర్వహించబోయే తమ పార్టీ ప్లీనరీకి ప్రతి ఒక వార్డు స్థాయి కార్యకర్తకు పార్టీ అధ్యక్షుడి సంతకంతో ఆహ్వానం ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. నవరత్నాల ఎజెండా అనేది ఇక్కడ నుంచే వచ్చిందని, అదే వేద మంత్రంలా 95 శాతం హామీలను అమలు చేశామన్నారు. గుంటూరులో వైఎస్సార్‌సీపీ ప్లీనరీ ప్రాంగణం ఏర్పాట్లను పార్టీ జాతీయ కార్యదర్శి విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి సుచరిత, పలువురు ముఖ్యనేతలతో కలిసి పరిశీలించిన అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడుతూ..'ఇదే స్థలంలో మరో ప్లీనరీ నిర్వహించబోతున్నాం. రాష్ట్ర భవిష్యత్తు చిత్ర పటాన్ని మళ్లీ చర్చిస్తాం. వరుసగా అధికారంలో మేమే ఉంటాం..అందుకే ప్రజల సమస్యలపై చర్చ. ఇది ఒక పార్టీ ప్లీనరీ కాదు...ప్రజల ఎజెండాతో ముందుకు వెళ్తున్నాం. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ ఘన విజయం సాధించిన పార్టీ మాది. 8వ తేదీ మాకు పవిత్రమైన రోజు...వైఎస్సార్ పుట్టినరోజు. అందుకే ఆ రోజు వైఎస్సార్‌సీపీ ప్లీనరీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం' అని తెలిపారు.వచ్చే ఎన్నికల్లో కిక్ బాబు ఔట్ నినాదంతో ముందుకు వెళ్తామని విజయసాయి రెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ప్లీనరీ నిర్వహిస్తున్నామని, మళ్లీ అధికారంలోకి వచ్చాక మళ్లీ ప్లీనరీ నిర్వహిస్తామన్నారు. తమ ప్లీనరీ సమావేశాలు మిగతా వాటికి భిన్నంగా ఉంటాయన్నారు. క్షేత్ర స్థాయి నుంచి వార్డు సభ్యుని వరకూ ఈ ప్లీనరీలో పాల్గొంటారని, వచ్చే నెల 8వ తేదీన అధ్యక్షుడు ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, 9వ తేదీన ముగింపు స్పీచ్ ఉంటుందన్నారు విజయసాయి రెడ్డి. వచ్చే నెల 8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి వైఎస్సార్‌సీపీ ప్లీనరీ జరుగుతుందని, 8వ తేదీన ప్లీనరీ ప్రారంభ కార్యక్రమం 9వ తేదీన ముగింపు కార్యక్రమంలోనూ పార్టీ అధ్యక్షులు పాల్గొంటారని మాజీ మంత్రి సుచరిత తెలిపారు. ఈ ప్లీనరీ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు అందరికీ దిశా నిర్దేశం చేస్తారని సుచరిత స్పష్టం చేశారు.

## 'సంక్షేమ పథకాల సామ్రాట్ సీఎం జగన్ ఒక్కరే'



నగరి: ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా వెన్నుచూపకుండా మొక్కవోని ధైర్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల సామ్రాట్ సీఎం జగన్ అని కొనియాడారు ఆర్‌కే రోజా. నగరి నియోజకవర్గంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్లీనరీ సమావేశంలో మాట్లాడిన మంత్రి రోజా..' సచివాలయ వ్యవస్థతో గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ అందించారు.జగన్ అంటే ఒక బ్రాండ్. కార్యకర్తలే వైఎస్సార్‌సీపీ బలం, బలగం. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను చంద్రబాబు ఏనాడు అమలు చేయలేదు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసింది చంద్రబాబు కాదా?'అని ప్రశ్నించారు. గతంలో పింఛన్ రావాలంటే జన్మభూమి కమిటీల కాళ్లు మొక్కాలి.సీఎం జగన్ గ్రామ, వార్డు వాలంటీర్లతో వ్యవస్థనే మార్చేశారు' అని అన్నారు మంత్రి రోజా.

### సీఎం వైఎస్ జగన్ బీసీ కులాలకు శ్రీరామరక్ష: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కులాలకు శ్రీరామరక్ష అని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రప్రదేశ్‌కు బీసీ కులాలకు చెందిన వ్యక్తి సీఎంగా ఉన్నా.. బీసీలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వరు. 56 కార్పొరేషన్‌ల ద్వారా బీసీల అభివృద్ధికి బాటలు వేశారు. దేశంలో చదువుకు ఇంత ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి మరొకరు లేరు. అమ్మఒడి, జగనన్న వసతి దీవెన ద్వారా ఎంతో మంది పేద పిల్లలకు భవిష్యత్ ఇస్తున్నారు. బీసీలంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలి. వైఎస్సార్‌సీపీ ప్లీనరిని విజయవంతం చేస్తాం' అని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు.



### ఉప రాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల..




న్యూఢిల్లీ : భారతదేశ ఉప రాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. జులై 5వ తేదీన ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆగస్టు 6వ తేదీన ఉప రాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్ జరగనుంది. అదే రోజు ఫలితాలను కూడా వెల్లడించనున్నారు. జులై 19 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు విధించారు. 20 నామినేషన్లను పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు జులై 22 తుది గడువు. ప్రస్తుతం ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు కొనసాగుతోన్న విషయం విదితమే. వెంకయ్యనాయుడు 2017 ఆగస్టు 11వ తేదీన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## అన్ని వర్గాల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం



తణుకు అర్బన్: ప్రజలకు పారదర్శకంగా సంక్షేమాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పరచారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. ఓకేసారి ఇంత మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత దేశచరిత్రలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. ఏ లక్ష్యంతో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయబడిందో దానికి కట్టుబడి ఉద్యోగులంతా ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు. పీజీలు చేసి ఈ చెత్త ఉద్యోగాలే దిక్కా అని కొందరు.. మీ ఉద్యోగాలు నీటి బుడగలే అంటూ ఇంకొందరు తమను విమర్శించారని, వీటికి చెక్ చెబుతూ చెప్పాడంటే చేస్తాడంతే అనే రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం కల్పించారని సచివాలయ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. తమ జీవితాలు మారిపోయాయంటూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్, మంత్రి కారుమూరికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సచివాలయ ఉద్యోగులతో కలిసి మంత్రి కారుమూరి కేక్ కట్ చేసి వారందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, మునిసిపాలిటీ పరిధిలోని సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఏపీ రైలు ప్రయాణికులకు శుభవార్త



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రయాణికులకు రైల్వే శాఖ శుభవార్త తెలిపింది. ఏపీలో పలు ప్రాంతాల మధ్య నడిచే ఏడు రైళ్లను జులై మాసం నుంచి పునరుద్ధరించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కొవిడ్ ప్రభావం వల్ల నిలిపివేసిన రైళ్లను తిరిగి నడిపించడానికి ముహూర్తం ఖరారు చేసింది. తిరుపతి నుంచి కాట్పాటి మధ్య నడిచే రైలును జులై 11 నుంచి పునరుద్ధరించనున్నారు. ప్రతిరోజు ఉదయం 10.55 నిమిషాలకు తిరుపతి నుంచి బయులు దేరి మధ్యాహ్నం 1.30 గంటలకు కాట్పాడి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు.కాట్పాడి నుంచి తిరుపతికి వెళ్లే రైలు జులై 11 నుంచి ప్రతిరోజు రాత్రి 9.55 గంటలకు కాట్పాడి నుంచి బయలుదేరి రాత్రి 11.50 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లే రైలును జులై 18 నుంచి ప్రతిరోజు సాయంత్రం 5.45 గంటలకు గుంటూరు నుంచి బయలు దేరి రాత్రి 7 గంటలకు చేరుకుంటుందని వివరించారు. తెనాలి నుంచి గుంటూరు వెళ్లే రైలు అదే రోజు నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు తెనాలి నుంచి బయలు దేరి సాయంత్రం 4.40 కు గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుదన్నారు.మార్కపూర్ రోడ్ నుంచి తెనాలి వెళ్లే రైలు జులై 18 నుంచి పునరుద్ధరించనున్నారు. ఈ రైలు ఉదయం 10.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.45 నిమిషాలకు తెనాలి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఇక నంద్యాలు నుంచి కడపకు వెళ్లే రైలును జులై 16 నుంచి పునరుద్ధరించానున్నారు. ఈ రైలు ఉదయం 5.50 గంటలకు బయలు దేరి 9.40 గంటలకు కడప రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివరించారు.అదేవిధంగా కడప నుంచి నంద్యాల్ వెళ్లే రైలును జులై 17 నుంచి పునరుద్ధరించనున్నామని తెలిపారు. ఈ రైలు సాయంత్రం 5.30 కడప నుంచి బయలు దేరి రాత్రి 9.30 గంటలకు నంద్యాల్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు.

### టీడీపీ గురించి మాట్లాడడం వృథా: మంత్రి బొత్స

అమరావతి : ఏపీలో తెలుగుదేశం పార్టీ గురించి మాట్లాడడం వృథా అని ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యనించారు. వైసీపీ ప్లీనరీ సమావేశాల సందర్భంగా విజయనగరం జిల్లా చీపురపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి చెందిన నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు.గత ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి చంద్రబాబు పెద్ద ఎత్తున డబ్బులు పంపిణీ చేసినా ఓటర్లు బుద్ధి చెప్పారని అన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో నియంతలా వ్యవహరించ వద్దని సూచించారు.

## 'మహా' సంక్షోభం..

ఠాక్రే సర్కారుకు రేపే బలపరీక్ష

మెజార్టీ నిరూపించుకోవాలని గవర్నర్ ఆదేశం



ముంబయి: మహారాష్ట్ర రాజకీయ సంక్షోభం కీలక దశకు చేరుకుంది.ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ కూటమికి బలపరీక్ష ఎదురైంది. అసెంబ్లీలో ఠాక్రే సర్కారు తమ మెజార్టీని నిరూపించుకోవాలని రాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ ఆదేశించారు. ఇందుకోసం రేపు(జూన్ 30) ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయాలని శాసనసభ కార్యదర్శిని ఆదేశించారు. ఈ మేరకు నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత గవర్నర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు ఈ విశ్వాస పరీక్ష జరగనుంది. ఈ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం 5 గంటల్లోగా పూర్తిచేయాలని గవర్నర్ సూచించారు. దీన్ని రికార్డ్ చేయాలని ఆదేశించారు.నిన్న రాత్రి భాజపా నేత, మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ గవర్నర్‌ను కలిశారు. బలపరీక్షకు సీఎంను ఆదేశించాలని కోరారు. 39 మంది శివసేన ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారనీ, సర్కారు మైనారిటీలో పడిందని రాసిన లేఖను ఆయనకు అందజేశారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్.. బలాన్ని నిరూపించుకోవాలని ఠాక్రే సర్కారును ఆదేశించారు.సుప్రీంకోర్టుకు ఠాక్రే సర్కారు..అయితే బలాన్ని నిరూపించుకోవాలంటూ గవర్నర్ ఇచ్చిన ఆదేశాలపై ఠాక్రే సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనిపై సీఎం ఠాక్రే తమ న్యాయ బృందాన్ని సంప్రదిస్తున్నట్లు సమాచారం. దీనిపై వారు నేడు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశముంది.మరోవైపు, గువాహటిలో ఉన్న ఏక్‌నాథ్ శిందే ఈ ఉదయం స్థానిక కామాఖ్య ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేపు తామంతా ముంబయికి తిరిగి వెళ్లనున్నట్లు తెలిపారు. శివసేన పార్టీలో 2/3 వంతుల మెజార్టీని నిరూపించుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు శిందే ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. శిందే వర్గం ఎమ్మెల్యేల కోసం ముంబయి, గోవాల్లో హోటల్‌లు బుక్ అయినట్లు తెలుస్తోంది. బలపరీక్ష నేపథ్యంలోనే అసమ్మతి నేతల్లో కొంతమందిని గోవా తరలించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

### ఏపీ ప్రభుత్వ విధానాలతో పోలవరానికి తీవ్ర నష్టం : చంద్రబాబు

అమరావతి : ఏపీ ప్రభుత్వం అవలంభిస్తున్న తప్పుడు, ఏకపక్ష నిర్ణయాలతో పోలవరం ప్రాజెక్టుకు తీవ్ర నష్టం జరుగుతుందని టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతుందడడం వల్ల సాంకేతికంగా నష్టం జరిగిందని అన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు మరో ఏజెన్సీకి అప్పగించారని తెలిపారు.ఆకస్మికంగా పనుల నిలిపివేతతో కొత్త ఏజెన్సీ పనులకు ఆరు నెలల సమయం పట్టిందని పేర్కొన్నారు. పనులు సకాలంలో ప్రారంభించక పోవడంతో డయాఫ్రం వాల్ దెబ్బతిందని అందుకు వైసీపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపలేదని అన్నారు. లేఖతో పాటు పీపీఏ మినిట్స్, కేంద్రం చేసిన సూచనల కాపీలను ఆయన జతచేశారు

### రఘురామపై సీఐడీ కేసు... విచారణకు ఏపీ హైకోర్టు అనుమతి

హైదరాబాద్: ఎంపీ రఘురామపై నమోదైన సీఐడీ కేసులో విచారణకు ఏపీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. తనపై కేసులను కొట్టివేయాలని హైకోర్టులో రఘురామరాజు పిటిషన్ దాఖలు చేశారు. ఎంపీ రఘురామరాజును రాజద్రోహం నేరం మినహా మిగతా సెక్షన్‌ల కింద విచారించవచ్చని కోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్ దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో లాయర్ సమక్షంలో విచారించాలని ఆదేశించింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విచారణ చేయాలని ఆదేశించింది. కేసుకు సంబంధించిన అంశాలు మినహా ఏ ఇతర అంశాలపై పిటిషనర్‌ను ప్రశ్నించకూడదని హైకోర్టు పేర్కొంది. అలాగే సీఐడీ కార్యాలయాలకు పిలిపించవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణ అంతా లాయర్ సమక్షంలోనే జరగాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తే బాధ్యులైన పోలీస్ అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఏపీ హైకోర్టు పేర్కొంది.



# సంపాదకీయం

గురువారం 30-06-2022

## రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ సాధ్యమా

ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా రాష్ట్రపతి ఎన్నికల బరిలో దిగిన, కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా, నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా, ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు బీజేపీలో ఉన్న సిన్హా, ఆ పార్టీలో ఉన్న మాజీ మిత్రుల మద్దతు కోరతానని చెప్పారు. నిజమే, రాష్ట్రపతి ఎన్నికల్లో, రాజకీయ పార్టీలు విప్. జారీ చేయవు. ఎలెక్టోరల్ కాలేజీలో ఓటర్లుగా ఉండే ఎంపీలు, ఎమ్మెల్యేలు తమకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేసేందుకు సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుంది. అయితే, సహజంగా పార్టీ నిర్ణయం ప్రకారమే, ఓటింగ్ ఉంటుంది. అక్కడక్కడా క్రాస్ ఓటింగ్ జరిగిన సందర్భాలు లేక పోలేదు. కానీ, క్రాస్ ఓటింగ్' అన్ని సందర్భాలో అయ్యే పని కాదు. ఇంతవరకు దేశ చరిత్రలో, క్రాస్ ఓటింగ్'తో, రాష్ట్రపతి అభ్యర్ధి గెలిచిన సందర్భం ఒకే ఒక్కటి కనిపిస్తుంది. 1969 రాష్ట్రపతి ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ నీలం సంజేవ్ రెడ్డిని తమ అభ్యర్ధిగా పోటీకి దించింది. అయితే, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, స్వతంత్ర అభ్యర్ధిగా బరిలో దిగిన వీవీగిరికి మద్దతుగా ఆత్మప్రభోదం పిలుపు ఇవ్వడంతో, అధికార కాంగ్రెస్ అభ్యర్ధి సంజీవ రెడ్డి ఓడి పోయారు. స్వతంత్ర అభ్యర్ధి వీవీ గిరి విజయం సాధించారు. అందుకే, రాష్ట్ర పతి ఎన్నికల్లో అదొక వైచిత్రిగా నిలిచి పోయింది. ఆ ఎన్నికాలో తప్ప, ఇకెప్పుడు అలాంటి సందర్భం ఎదురు కాలేదు. అదలా ఉంటే, ఇప్పుడు యశ్వంత్ సిన్హా సహజంగా అందరితోపాటుగా బీజేపీ మద్దతు కూడా కోరతానని అంటే, అదొక రకం, అందరూ చేసేదే, రేపు ఎన్డీఎ అభ్యర్ధి ద్రౌపది ముర్ము కూడా, కాంగ్రెస్ సహా, అన్నిపార్టీల నాయకులను కలిసి, మద్దతు కోరతారు. కానీ, యశ్వంత్ సిన్హా, ప్రత్యేకించి బీజేపీ మిత్రులను మద్దతు కోరతానని చెప్పడం, రాజకీయ చర్చకు తెర తీసింది ఇటు అధికార కూటమిలో అటు విపక్ష కూటమిలోనూ ఆసక్తికర చర్చకు జరుగుతోంది, అనుమనాలూ వ్యక్తమవుతున్నాయి. ఓ వంక ప్రతిపక్ష కూటమికి సారధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సహా సిన్హాకు మద్దతు ఇస్తున్న పార్టీలు, "రాష్ట్రపతి ఎన్నిక.. ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ కాదు రెండు సిద్ధాంతాల మధ్య జరిగే పోరు" గా చూస్తున్నారు. రాహుల్ గాంధీ అయితే, మరో అడుగు ముందుకేసి, రాష్ట్రపతి ఎన్నిక, ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా జరుగుతన్న విపక్షాల ఉమ్మడి పోరాటంగా అభివర్ణించారు.మరో వంక యశ్వంత్ సిన్హా, బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం వల్లనే తాను పార్టీ వదిలివచ్చానని చెప్పడం ద్వారా, తనకు సంఘ్ పరివార్' సిద్ధాంతాలతో విభేదాలు లేవని చెప్పకనే చెప్పారు. అది చాలా వరకు నిజం కూడా మంత్రి పదవి ఆశించి, రాలేదన్న దుగ్ధతో అయన బీజేపీని వదిలేశారనే ఆరోపణలు లేక పోలేదు. మరోవంక సిన్హా బీజేపీలోని మిత్రుల మద్దతు కోరతానని ప్రకటించారు. ఈ అన్నిటినీ మించి, అయన కుమారుడు జయంత్ సిన్హా ఇప్పటికీ బీజేపీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. కొంతకాలం మోడీ మంత్రివర్గంలోనూ ఆర్ధిక శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఇప్పుడు కూడా బీజేపీ ఎంపీగా, ఆర్ధిక మంత్రిత్వ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. అంటే, యశ్వంత్ సిన్హా బీజేపీ నుంచి బయటకు వచ్చినా, 'ఇంగువ కట్టిన గుడ్డకు వాసనా వదలనట్లు సంఘ పరివార్ వాసనలు మాత్రం ఇంకా పూర్తిగా పోలేదని అనుకోవచ్చని అంటున్నారు. అదోకకటి అలా ఉంటే, పాత వాసనలు యశ్వంత్ సిన్హాకు మేలు చేస్తాయా అంటే, అనుమానమే అంటున్నారు. యశ్వత్ సిన్హానే అన్నట్లు, అప్పుడు ఆయన ఉన్నప్పుడు ఉన్న బీజేపీకి ఇప్పుడున్న బీజేపీకి పొంతనే లేదు. సో.. వ్రతం చెడ్డా సిన్హాకు ఫలితం దక్కక పోవచ్చని, ముఖ్యంగా మహారాష్ట్ర పరిణామాలు, ఇటీవల జరిగిన, రాజ్య సభ ఎన్నికల ఫలితాలు, కొద్ది రోజుల క్రితం యూపీ సహా మరికొన్ని రాష్ట్రాలలో జరిగిన లోక్ సభ, అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల ఫలితాల నేపధ్యంలో బీజేపీలోని అసంతృప్తులు క్రాస్ ఓటింగ్' కు పాల్పడే సాహసం చేయక పోవచ్చని, పరిశీలకులు అంటున్నారు.

## చంద్రబాబు పై పోటీకి హీరో

తిరుపతి, జూన్ 29, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎన్నికల వేడిని తలపిస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఆరోపణలు, బూతులు, సవాళ్లతో ఇప్పుడే ఏపీ రాజకీయాలు ఎన్నికలను సమరాన్ని తలపిస్తున్నాయి. ప్రతిపక్ష టీడీపీ జనంలోకి వెళ్లేందుకు ఇప్పటి నుండి ప్రణాళికలు రచిస్తోంది. చిన్న అవకాశం దొరికినా ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపిస్తోంది. దీనికి ధీటుగా వైసీపీ నేతలు కౌంటర్లు ఇస్తున్నారు. రాబోయే ఎన్ని?కల్లో అధికారమే లక్ష్యంగా టీడీపీ మహానాడు, బహిరంగా సభలు, పాదయాత్ర వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువైతోంది. ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను క్యాష్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఇదిలా ఉంటే, అధికార వైసీపీ రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును ఓడించేందుకు భారీ వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు స్టార్ హీరోను బరిలోకి దింపేందుకు రెఢీ అవుతోన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.తమిళ్ స్టార్ హీరో విశాల్‌ను వచ్చే ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుపై పోటీకి దించేందుకు వైసీపీ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, విశాల్ తమిళ్ హీరో అయినప్పటికీ.. అతడి తండ్రి కృష్ణారెడ్డి తెలుగు వ్యక్తే. అంతేకాకుండా వారి బంధువులు కూడా చాలా మంది ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికి ఉన్నారు. విశాల్‌కు కూడా రాయలసీమలో ఫ్యాన్ ఫోలోయింగ్ భారీగా ఉంటుంది. దీనిని క్యాష్ చేసుకునేందుకు వైసీపీ చూస్తోందని జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా హీరో విశాల్ ఏపీ సీఎం జగన్‌కు వీరాభిమాని. ఈ విషయాన్ని అతడే ఎన్నోసార్లు బహిరంగంగానే చెప్పాడు. ఈ సమీకరణాలు అన్నింటిని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబుపై విశాల్‌ను పోటీకి దింపేందుకు వైసీపీ సిద్ధమైనట్లు వార్తలు చక్కెర్లు కొడుతున్నాయి. అయితే, కుప్పం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. 1989 నుంచి అక్కడ మాజీ సీఎం చంద్రబాబుకు తిరుగేలేదు. కుప్పం నియోజక వర్గంలో ప్రత్యర్థి ఎవరైనా వార్ వన్ సైడే అంటే అతిశయోక్తి కాదు. కుప్పంలో అంతటి బలమైన సామ్రాజ్యం నిర్మించుకున్నాడు బాబు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అతడికి కుప్పంలో కొన్ని ఎదురు దెబ్బలు తగిలాయి. ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కుప్పంలో టీడీపీకి ఘోర పరాజయం ఎదురైంది. గెలుపు ఉత్సాహంతో ఉన్న వైసీపీ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు కుప్పంలో చెక్ పెట్టడంపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే హీరో విశాల్‌ను రంగంలోకి దించాలని చూస్తున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు జోరుగా ఊపందుకున్నాయి. ఇటీవల వైసీపీ నేతలు కూడా వచ్చే ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబును ఓడిస్తామని పదే పదే చెబుతోంది. అయితే, ఈ వార్తలపై విశాల్ నుండి కానీ, అటు వైసీపీ నుండి కానీ అధికారికంగా క్లారిటీ లేదు.

## సగానికి తగ్గిన అమ్మఒడి పథకం




విజయవాడ, జూన్ 29, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నిటిలోకి, 'అమ్మఒడి' అత్యంత ప్రతిష్టాత్మక పథకం...అలాగని ప్రభుత్వమే ప్రచారం చేసుకుంటోంది. న భూతో న భవిష్యతి, ఇలాటింటి పథకం ఇంతవరకు లేదు ఇక ముందు ఉండదు, అని వైసీపీ సర్కార్ ఫుల్ పేజీ ప్రకటనలతో ... ప్రచారం సాగించింది. అయితే, ఇప్పుడు, అదే అమ్మఒడి పథకాన్ని, గుదిబండ పథకంగా భావిస్తోందా ? ఏదో ఒక సాగుతో, 'అమ్మఒడి' భారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తోందా? అంటే, ప్రభుత్వ వర్గాల నుంచే అవుననే సమాధానం వస్తోంది. నిజానికి, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రభుత్వం, ఓటు బ్యాంక్ రాజకీయాల్లో భాగంగా అభివృద్ధిని పక్కన పెట్టి, అప్పులు చేసిమరీ,సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసింది. సంక్షేమ పథకాలే తమను మళ్ళీ మళ్ళీ అందలం ఎక్కిస్తాయనే భ్రమల్లో వైసీపే నేతలు తెలిపోతుంటారు. సంస్థేం లెక్కలు ఆ పార్టీ నాయకులు గొప్పగా చెప్పుకుంటారు. ముఖ్యమంత్రి అయితే, మీటలే మన ఓట్లు... వచ్చే ఎన్నికలలో 175 సెట్లు మనవే అనే ధీమా వ్యక్త చేసారు. అయితే, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, అదుపు తప్పిన అవినీతి కారణంగా మూడేళ్ళు గడించే సరికి సర్కార్ ఖజానా ఖాళీ అయింది. దీంతో, ప్రభుత్వం ఒక్కొక్క పథకాన్ని, ఒక్కొక్క సాకుతో నీరు గార్చే పనిలో పడింది. చివరకు, దుల్హన్ వంటి కొన్ని పథకాలకు పొర్తిగానే మంగళ పాడేశారు. అందులో భాగంగా అమ్మఒడి పథకాన్ని అంచల వారీగా అటకెక్కించడం ఖాయని, ప్రభుత్వ అధికారులే అనుమనాలు వ్యక్తపరుస్తున్నాబు. కొవిడ్ సాకుగా చూపి ఒక సంవత్సరం, పథకాన్ని వాయిదా వేశారు. ఆ తర్వాత, 75 శాతం హాజరు నిబంధన పేరుతో 'అమ్మ ఒడి' నిధులను 50 వేల మందికి ఎగ్గొట్టారు. ఇక ఇప్పుడు అమ్మఒడిలో నగదుకు బదులుగా ల్యాప్‌టాప్ ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. బహిరంగ మార్కెట్‌లో ల్యాప్‌టాప్ ధరలు పెరిగాయని పంపిణీ నిలిపివేస్తున్నామని చావు కబురు చల్లగా చెప్పింది. నిజానికి, ఒక విధంగా పిల్లలకు ల్యాప్‌టాప్'లు ఇవ్వడం వలన, కొంత ప్రయోజనం ఉంటుంది. అయితే, ప్రభుత్వం ఆర్థిక భారానికి వెరసి వెనకడుగు వేసింది.నిజానికి ఒక్క అమ్మఒడి పథకమే కాదు, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, సంక్షేమా పథకాలు ప్రకటించడంలో ఎంత దూకుడు చూపారో, ఇప్పుడు ఒక్కొక్క పథకానికి కోతలు పెట్టడంలోనూ, అంతకంటే ఎక్కువ దూకుడు చూపుతున్నారు.ఒంటరి మహిళలకు పింఛను ఇచ్చే వయసును 35 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచి లబ్ధిదారుల సంఖ్యను లక్షల్లో తగ్గించారు. ఇలా మొత్తానికి జగన్ రెడ్డి ప్రభుత్వం, మూడేళ్ళలో రాష్ట్రాన్ని, ఓ వంక అప్పుల ఉబిలో చేర్చింది. మరి వంక సక్షేమ పథకాలకు చెల్లు చీటీ ఇచ్చింది. అందుకే, ప్రజలు ఒక్క ఛాన్స్ సీఎంను ఎంత త్వరగా సగానంపుదామా అని, ఎదురు చూస్తున్నారు.

## ఏబీవీపై ఇంకానా...

విజయవాడ, జూన్ 29, సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పై మరోసారి సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుతం ఏపీ ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తోన్న ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారనే అభియోగాలపై సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం రాత్రి సీఎస్ సమీర్ శర్మ సస్పెండ్ ఆదేశాలు జారీ చేశారు. కాగా టీడీపీ ప్రభుత్వ హయాంలో గూఢచర్యం చేశారని ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయ్యారు వెంకటేశ్వరరావు. అప్పటి నుంచి తన పోస్టింగ్ కోసం పోరాటం చేస్తూ వచ్చారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆయనపై సస్పెన్షన్ ఎత్తేసిన జగన్ సర్కార్.. సర్వీస్ ను మాత్రం చాలా కాలం పాటు పెండింగ్ లో పెట్టింది. సుదీర్ఘ పోరాటం తర్వాత ఆయనకు పోస్టింగ్ ఇచ్చింది.కాగా 2022 మే 19న సాధారణ పరిపాలనశాఖకు ఏబీవీ రిపోర్టు చేశారు. దీంతో ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న జి.విజయ్‌కుమార్‌ను రిలీవ్ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో ఏబీవీని నియమించింది. అయితే తాజాగా మరోసారి ఏబీవీని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

## జగన్ ను సంక్షేమం కాపాడుతుందా

విజయవాడ జూన్ 29, తొమ్మిదేళ్లు కష్టపడితే జగన్ ముఖ్యమంత్రి కాగలిగారు. అన్నీ కలసి రావడం ఆయనను ముఖ్యమంత్రి పదవికి మరింత చేరువ చేసింది. కానీ ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్ తీరులో స్పష్టమైన మార్పు కన్పిస్తుంది. వాస్తవాలకు దూరంగా ఉంటున్నారు. అధికారుల నివేదికలపై ఆధారపడుతున్నారు. ఒకరిద్దరు పార్టీ నేతలనే జగన్ నమ్ముకున్నారు. ఆల్ ఈజ్ వెల్ అన్న నమ్మకంతో జగన్ ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు జగన్ వద్దకు చేరడం లేదు. ఇటు జనానికి, అటు లీడర్లకు, మరో వైపు క్యాడర్ కు దూరంగానే ఉంటున్నారు... విపక్ష పార్టీలకు చెందిన మీడియా బయటపెడుతున్నా వాటిని అసలు లెక్క చేయడం లేదు. టీడీపీ అనుకూల మీడియా జగన్ సర్కార్ పై ఎక్కువగా విమర్శలు చేస్తుంది. అందులో ఏ మాత్రం సందేహం లేదు. అదే సమయంలో ఆ మీడియా అందించే కథనాలను అంత పూర్తిగా కొట్టిపారేయలేం. కొంత నిజముంది. 40 శాతం నిజంతో ఆ మీడియా కొంత అతి చేస్తున్నా జగన్ మాత్రం దానిని పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేస్తున్నారు. అందులో ఉన్న కొద్దిపాటి వాస్తవాన్ని కూడా జగన్ అంగీకరించడం లేదు.. ఇది 2019 ఎన్నికల్లో చంద్రబాబు పరిస్థితికి అద్దం పడుతుందని చెప్పాలి. అప్పుడు కూడా చంద్రబాబుకు అధికారులు బాకా ఊదారు. తప్పుడు నివేదికలు ఇచ్చారు. బాబు నమ్మే ఒకరిద్దరు నేతలు కూడా పోలవరం, అమరావతి మళ్లీ సీఎంగా చేస్తుందని చంద్రబాబును నమ్మించారు. ఇప్పుడు కూడా వైసీపీలో అదే జరుగుతుంది. పథకాలు బలంగా ప్రజల్లోకి వెళ్లాయని, మూడున్నర కోట్ల సాలిడ్ ఓటు బ్యాంకు ఉందని జగన్ ను కొందరు నేతలు నమ్మిస్తున్నారు. కానీ ఆరోజు చంద్రబాబును పోలవరం, అమరావతి కాపాడలేదు. వచ్చే ఎన్నికల్లోనూ జగన్ ను సంక్షేమ పథకాలు, నగదు బదిలీయే రక్షిస్తాయనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఎమ్మెల్యేలపై వ్యతిరేత ఉందని భావిస్తున్నారు జగన్. కానీ అంతకు మించి ప్రభుత్వం పై ఉందని తెలుసుకోలేకపోతున్నారని పార్టీ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లలో అభివృద్ధిని పక్కనపెట్టి పూర్తిగా తాడేపల్లి కార్యాలయంలో కూర్చున్న జగన్ ను పని చేయని సీఎంగా జనం భావిస్తున్నారు. చంద్రబాబుతో పోల్చుకుని ఆయన పనితీరును బేరీజు వేసుకుంటున్నారు. సీఎం కాక ముందు జనాలకు ఎంత దగ్గరగా ఉన్నారో, అయినా తర్వాత అంత దూరమయ్యారని ఆ పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. మొత్తం మీద జగన్ జాగ్రత్త పడకపోతే ఒక్క ఛాన్స్ అన్న ఆయన మాట నిజం కాక తప్పదు.

## మంత్రివర్గం ఫస్ట్ బ్యాచే బెటరా..?

విజయవాడ, జూన్ 29, ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గంలో సభ్యులు ఉన్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతుంది. 2019 ఎన్నికల్లో గెలిచిన తర్వాత వైఎస్ జగన్ మంత్రి వర్గ విస్తరణను రెండు సార్లు చేశారు. మంత్రులుగా ఉన్న పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ రాజ్యసభ సభ్యులుగా వెళ్లిపోవడంతో ఒకసారి విస్తరణ చేశారు. తర్వాత ఇటీవల పూర్తిగా మంత్రివర్గాన్ని విస్తరించారు. పాత మంత్రులు కొందరు ఉన్నా కొత్తవారికి ఎక్కువ సంఖ్యలో అవకాశం కల్పించారు. అయితే జగన్ మంత్రివర్గంలో ఫస్ట్ బ్యాచ్ బెస్ట్ అన్న కామెంట్స్ వినపడుతున్నాయి. విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టడంలో పాత మంత్రులే బెస్ట్ అని చెప్పక తప్పదు. తొలి మంత్రి వర్గంలో కొడాలి నాని, పేర్ని నాని, బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, అవంతి శ్రీనివాస్, బాలినేని శ్రీనివాసులు రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది మంత్రులు యాక్టివ్ గా ఉన్నారు. విపక్షాల విమర్శలను వెంటనే తిప్పి కొట్టేవారు. కానీ రెండో బ్యాచ్ లో వచ్చిన మంత్రులు పెద్దగా యాక్టివ్ గా లేరన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కేవలం అంబటి రాంబాబు, జోగి రమేష్, ఆర్కే రోజా వంటి వారే ఎక్కువగా ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు. మున్సిపల్ శాఖ నుంచి విద్యాశాఖ తీసుకున్న తర్వాత బొత్స సత్యనారాయణ కూడా పెద్దయాక్టివ్ గా లేరు. మిగిలిన మంత్రులు తమ శాఖకే పరిమితమయ్యారు. ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను పట్టించుకోవడం లేదు. పార్టీలో చర్చ.. పార్టీ పరంగా కూడా ఇది చర్చనీయాంశమైంది. ప్రభుత్వం తరుపున వాయిస్ వినిపించే వారు తక్కువయ్యారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఎక్కువ మంది మంత్రులు తమ నియోజకవర్గాలకు మాత్రమే పరిమితమయ్యారు. జగన్ తన మంత్రి వర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశం కల్పించినా సరైన ప్రచారం లేక అనేక పథకాలు ప్రజలకు చేరువ కావడం లేదు. దీంతో మొదటి బ్యాచ్ లోనే మంత్రులు యాక్టివ్ గా ఉండేవారంటున్నారు. తొలివిడతలో మంత్రులుగా పనిచేసిన వారిని కేబినెట్ నుంచి తొలగించడంతో వారు కూడా ఇన్ యాక్టివ్ అయ్యారు. వారు తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. దీంతో ఫస్ట్ బ్యాచ్ బెస్ట్ అని... సెకండ్ బ్యాచ్ వేస్ట్ అన్న కామెంట్స్ పార్టీలోనే వినడుతున్నాయి.

## వైసీపీకి వ్యతిరేకత పెరుగుతోందా

విజయవాడ, జూన్ 29, రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా వార్ వన్‌సైడ్. ఇక ఉపఎన్నికల్లో అయితే చూసుకోవాల్సిన అవసరం లేదు. లక్ష మెజారిటీతో గెలుపొందడం ఖాయం. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా క్లీన్ స్వీప్ చేసేస్తాం. 175 నియోజకవర్గాల్లో విజయ పతాకం ఎగరవేస్తాం'. ఇది వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకుల్లో ఉన్న ధీమా. 2019 ఎన్నికల అనంతరం జరిగిన తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెల్లడైన ఫలితాలను పరిశీలిస్తే వైసీపీకి అంత అనుకూలంగా లేవని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఇటీవల జరిగిన అన్ని ఉపఎన్నికల్లోనూ వైసీపీ విజయం సాధించింది. తిరుపతి లోక్‌సభ ఉపఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించగా, బద్వేలు, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థిని బరిలోకి దించలేదు. మెజారిటీపై పదే పదే శపథాలు చేసినా ఎక్కడా వైసీపీ అందిపుచ్చుకోలేదు. ఈ ఎన్నికల్లో గెలుపునే అస్త్రంగా చేసుకుని మూడేళ్ల పాలనకు రెఫరెండం అనుకుంటే వైసీపీ బొక్కబోర్లా పడినట్లేనని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఈ ఫలితాలు లోలోపల మాత్రం మదనపెట్టిస్తున్నాయని తెలుస్తున్నది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 60 శాతం మంది ప్రజాప్రతినిధులు ఓటమి పాలయ్యే అవకాశం ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ అనుకూల సర్వేలో తేటతెల్లమైనప్పటికీ ఆ పార్టీ మాత్రం తమకు ఎదురేలేదని చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. వైసీపీ నాయకత్వం మేల్కొనకపోతే 2024 ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది.రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 151 అసెంబ్లీ, 22 లోక్‌సభ స్థానాలను గెలుచుకుని తిరుగులేని పార్టీగా అవతరించింది. అనంతరం జరిగిన ఎన్నికల్లోనూ విజయ దుందుభి మోగించింది. సాధారణ ఎన్నికల అనంతరం జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్ఆర్ ఘన విజయం సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ వేవ్ నడిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుపై ప్రత్యేకంగా ట్వీట్ చేసి తన ఆనందాన్ని కార్యకర్తలతో పంచుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అన్ని స్థానాల్లోనూ గెలుపొందడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉంది. పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు, బెదిరింపులు, కుట్రలను వ్యతిరేకిస్తూ, ఈసీ తీరును తప్పుబడుతూ ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నుంచి తప్పుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడే స్వయంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షమైన టీడీపీ బరిలో లేనప్పుడు వైసీపీ గెలుపు ఏంటనేది అందరికీ తెలిసిందే. టీడీపీ పోటీ చేయని పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఎవరిపై గెలిచినట్టు? అసలు పోటీయే లేనిచోట గెలుపు ఎలా ఉంటుంది? టీడీపీ ఎన్నికలను బహిష్కరిస్తే అది ఓటమి అవుతుందా.. భారీ విజయం అవుతుందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా జరుగుతున్నది.మరోవైపు తిరుపతి లోక్‌సభ, బద్వేలు ఉపఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించింది. ఊహించినంత మెజారిటీ అయితే సాధించడంలో వైఫల్యం చెందింది. తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బరిలోకి దించడంతో మెజారిటీ తగ్గింది అని వైసీపీ కప్పిపుచ్చుకుంటుంది. తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లో దొంగ ఓట్లు పడ్డాయనే ప్రచారం ఇప్పటికీ ఉంది. ఎందుకంటే ఇతర ప్రాంతాలకు చెందిన వాళ్లు అనేక బస్సులలో తరలివచ్చి ఓట్లు వేశారు. వారిని వివరాలు అడిగినప్పటికీ చెప్పలేని పరిస్థితి. ఇవన్నీ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రత్యక్షంగా ప్రజలంతా తిలకించిన సంగతి తెలిసిందే. బద్వేలు ఎన్నికల్లోనూ బయట వ్యక్తులు కనిపించడం కలకలం రేపింది. ఆ ఎన్నికల్లోనూ వైసీపీ ఊహించినంత మెజారిటీ రాలేదు. దీంతో తిరుపతి లోక్‌సభ, బద్వేలులో వైసీపీ గెలుపు దొంగ ఓట్ల వల్లే సాధ్యమైందని టీడీపీ, బీజేపీలు తీవ్రంగా విమర్శించడం తెలిసిందే. బద్వేలులోనూ టీడీపీ అభ్యర్థి బరిలో లేకపోయినప్పటికీ మెజారిటీ లక్ష దాటలేదు. ఇదంతా వైసీపీపై వ్యతిరేకతేనని విమర్శలున్నాయి. అన్ని ఉపఎన్నికల్లోనూ వైసీపీ డబ్బులు సైతం పంపిణీ చేసిందని విపక్షాలు ఆరోపిస్తుండడం విధితమే.మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆకస్మిక మృతితో ఆత్మకూరు ఉప ఎన్నిక అనివార్యమైంది. గౌతమ్‌రెడ్డి సోదరుడు విక్రమ్‌రెడ్డిని వైసీపీ బరిలో దించింది. తాజా ఉప ఎన్నికలో ఆయన 82, 888 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ లక్ష మెజారిటీ ఖాయమని ధీమా వ్యక్తం చేసింది. అనుకున్న మెజారిటీ సాధించలేకపోయింది. ఈ ఎన్నిక కేవలం సానుభూతి కోణంలోనే జరిగిందని అంటున్నారు. వాస్తవానికి ఆత్మకూరు మేకపాటి కుటుంబానికి కొట్టిన పిండి. సొంత నియోజకవర్గం. మరోవైపు యువకుడైన మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మరణం అందర్నీ కలచివేసింది. ఇవి రెండే వైసీపీ గెలుపునకు ప్రధాన కారణంగా మారింది. ఈ ఎన్నికల్లో పార్టీ పరంగా చూసుకుంటే మేకపాటి కుటుంబం ఇమేజ్, సానుభూతి బాగా వర్కౌట్ అయినట్లు తెలుస్తున్నది. ఈ ఎన్నికల్లో బీజేపీకి 19,332 ఓట్లు రావడం అంటే సామాన్యమైన విషయం కాదు. ఇన్ని ఓట్లు వచ్చినప్పటికీ డిపాజిట్ రాలేదని వైసీపీ ఎగతాళి చేస్తున్నది. ఈ ఓట్లు ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని తెలుస్తున్నది

.రాష్ట్రంలో వైఎస్ జగన్ పాలనపై రోజు రోజుకూ వ్యతిరేకత పెరుగుతున్నది. ధరల పెరుగుదల, పన్నుల బాదుడు, పథకాల్లో కోత, మహిళలపై దాడులు, లైంగికదాడులు, టీడీపీ నేతల హత్య ఇలా అనేక అంశాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారాయనే ప్రచారం జరుగుతున్నది. టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆ పార్టీ శ్రేణులు చేస్తున్న ఆరోపణలు వారి కార్యకర్త దృష్టిలోకి తీసుకు వెళ్లింది. మూడు రాజధానుల విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఎటూ తేల్చుకోలేకపోతున్నది. అమ్మఒడి లాంటి పథకాలకు కోతలు, ఒంటరి మహిళల పెన్షన్ కు వయోపరిమితిని పెంచడం ఇవన్నీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచడానికి కారణమయ్యాయి. ఉపఎన్నికల్లో ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రధాన ప్రతిపక్షం ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంతో వైసీపీకి కలిసివస్తున్నది. అంతేతప్ప టీడీపీ బరిలో ఉంటే వైసీపీ సత్తా ఏంటో తేలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం 2019 తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ గెలుపొందినప్పటికీ.. ఆ ఫలితాలు 2024 ఎన్నికలను ప్రభావితం చేయలేవని పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతున్నది. ఈ వ్యతిరేకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుర్తించారని తెలుస్తున్నది. అందువల్లే రెండున్నరేళ్ల ముందే ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ టీమ్‌ను సీఎం జగన్ రంగంలోకి దించారని సమాచారం.

## అగ్ని ప్రమాదల గురించి అవగాహన

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో వరల్డ్ విజన్ ఇండియా వారు మరియు ప్రభుత్వ అగ్నిమాపక శాఖ వారి అద్వర్యం లో అయ్యలూరు మరియు రాయమల్పురం గ్రామముల యందు అగ్ని ప్రమధాల మిధ ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పటుచేయడం జరిగింది. ఈకార్యక్రమంలో అగ్ని ప్రమాదాలనుంచి ఎలాబయటపడాలో అని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తిరుపతిరావు. ఫైర్ ఆఫీసర్ అయ్యుబ్ ఖాన్ వారి సిబంధి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లు జెస్సీ ,రవి మరియు గ్రామపెద్దలు బసవేశ్వర రెడ్డి పాల్గొన్నారు .

## భాగస్వామ్య పక్షాలతో రైతు సంఘాల తో ముఖాముఖి

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నాడు నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్.. ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మార్కుఫెడ్ చైర్మన్ పి.పి. నాగిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, వ్యవసాయ మరియు అనుబంధ రంగాల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 28వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో బదిలీ అయిన పోలీస్ కానిస్టేబుల్లకు ఘనంగా వీడ్కోలు

నంద్యాల జూన్ 29 నంద్యాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీ కావడంతో ఒకటవ పట్టణ ఎస్ఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ పీరయ్య, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో తమ తోటి సిబ్బందికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి పూలమాలలు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన సిబ్బంది తమ అధికారులు ఇంత ఘనంగా సన్మానించడం సంతోషంగా ఉందని అన్నారు. ఇక్కడి అధికారులు సిబ్బందితో కలిసి పని చేసి ఒక కుటుంబంగా ఉండి బదిలీల్లో భా30గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి మంథని ప్రతినిధి, ప్రజాక్రాంతి, జూన్ 29 : గుర్తుతెలియని వాహనం ఢీకొని బుధవారం ఉదయం ఇద్దరు మృతి చెందిన ఘటన పెద్దపెల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్పూర్ గ్రామ శివారులోని గాడిదల గండి గుట్ట వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మంథని మండలం ఖాన్సాయిపేట గ్రామానికి చెందిన జక్కుల కుమార స్వామి (48) పెరల విమల (40) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని మరణించారు. కుమారస్వామి, విమల లు వేర్వేరు పనులపై హైదరాబాద్ వెళ్లి తమ గ్రామామైన ఖాన్సాయిపేట కు టిఎస్ 22 బి 8217 అనే నెంబర్ గల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కాటారం వెళ్లే దారిలో గాడుదుల గండి సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికి అక్కడే మరణించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. వెంకటేశ్వర్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మంథని సిఐ జి.సతీష్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తిస్తామన్నారు.గంగా ఇక్కడి నుండి బదిలీ అయి వెళ్ళిపోవడం కొంత బాధగా ఉందని వారన్నారు తమకు వీడ్కోలు పలికిన ఎస్ఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ పీరయ్య, మరియు తోటి సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రిమాండ్ కి మహిళా తాహసిల్దార్

తిరుపతి తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం పోర్టు భూముల భూ కుంభకోణం కేసులో సస్పెన్షన్ లో ఉన్నా ఏ వన్ ముద్దాయి తాసిల్దార్ గీతా వాణి నేడు గూడూరు కోర్టులో జడ్జి ఎదుట లొంగిపోయారు నిందితురాలి కి అడిషనల్ మేజిస్ట్రేట్ అశోక్ కుమార్ 14 రోజులు రిమాండ్ విధించారు. చిల్లకూరు మండలం తమ్మిన పట్నం రెవెన్యూలో సర్వేనంబర్ 94-3లో ఉన్న 272 ఎకరాల ప్రభుత్వ భూమిని పారిశ్రామిక కారిడార్ కు కేటాయించారు. ఆ భూములనే డైరెక్టర్ ఆఫ్ పోర్టు పేరిట భూ హక్కులను బదలాయించారు. ఆ భూముల్లో 209 ఎకరాలను 11 మంది ప్రైవేట్ వ్యక్తులకు రెవెన్యూ అధికారులు కట్టబెట్టారు. ఇది వెలుగులోకి రావడంతో జిల్లాలో సంచలనమైంది.... కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు సమగ్రవిచారణ చేపట్టి నివేదికలను సమర్పించాలని గూడూరు ఆర్డీవో మురళీకృష్ణ ను ఆదేశించారు. విచారణ జరిపిన మురళీకృష్ణ కు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. డైరెక్టర్ ఆఫ్ పోర్టు అనుభవదారులుగా ఉన్న 209 ఎకరాలను వెబ్ ల్యాండ్ అడంగళ్ లోకి మార్పుచేయాలని చిల్లకూరు తహసిల్దార్ గీతావాణి ఈఏడాది ఫిబ్రవరి 15న రాతపూర్వకంగా ఆదేశించినట్లు విచారణలో గుర్తించారు. ఖాతా నంబర్లు 278నుంచి 288 వరకు 11 మంది వ్యక్తుల పేరిట సబ్ డివిజన్ చేసిన సర్వే నంబర్ ఆధారంగా ఆన్ లైన్ హక్కులు కల్పించారు.పక్కాగా హక్కులుండే విధంగా ఈసీలో సైతం వారు పేర్లు పొందుపర్చారని వెల్లడైంది. విచారణ సందర్భంగా నకిలీ హక్కుదారులు ఎవరు కూడా ఈ భూములు తమవని ముందుకు రాలేదు. భూ కుంభకోణంలో 15 మంది నిందితులు కాగా 14 మందిని గతంలో పోలీసులు అరెస్టు చేశారుఅజ్ఞాతంలో ఉన్న తాసిల్దార్ గీతా వాణి నేడు కోర్టులో లొంగిపోయారు పోలీసులు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా జైలుకు తరలించారు విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### సస్పెన్షన్ పై స్పందించిన సినీయర్ ఐపీఎస్ అధికారి ఏబి వెంకటేశ్వ రావు

విజయవాడ తన సస్పెన్షన్ పై సినీయర్ ఐపీఎస్ అధికారి ఏబి వెంకటేశ్వ రావు స్పందించారు. సస్పెన్షన్ జీవో నా చేతికి ఇంకా ఇవ్వలేదు. సామాజిక మాధ్యమాల్లో మాత్రమే చూసాను. ఏసీబీ కేసు ఉన్న మాట వాస్తవమే. ఒకటిన్నర సంవత్సరం క్రితం కేసు రిజిష్టర్ చేసినా ఇంతవరకూ చార్జిషీట్ వేయలేదని అయన అన్నారు. ట్రయల్ మొదలవకుండా సాక్షులను నేను ఎలా ప్రభావితం చేస్తాను....?? ఎటువంటి చచ్చు సలహాలు ఏ తీసేసిన తహసీల్దార్ లేక పనికిమాలిన సలహాదారులో ఇచ్చి ఉంటారు...! ఒకసారి హై కోర్టు కొట్టేసినప్పుడు అదే సెక్షన్ కింద మళ్లీ ఎలా సస్పెండ్ చేస్తారు. 12 సీబీఐ,6 ఈడీ కేసుల్లో జగన్ కు చార్జిషీట్ లు ఉన్నాయి.ఐయేఎస్ అధికారిణి శ్రీలక్ష్మి పైనా చార్జిషీట్ లు ఉన్నాయి. శ్రీలక్ష్మి కి వర్తించని నిబంధనలు నాకు ఎలా వర్తిస్తాయి. ఏసీబీ వాళ్ళు ఇచ్చిన నివేదికలో ప్రతి వాక్యం తప్పు.నేను నిరూపిస్తాను. ఒక్క రూపాయి అవినీతి జరగని చోట అవినీతి కేసు ఎలా పెడతారు. ఇజ్రాయెల్ వాళ్లకు రెండు లెటర్ లు రాశారు.అవినీతి నిరోధక చట్టాలకు లోబడి పనిచేస్తామని చెప్పారు. ఇలాంటి వ్యక్తుల వల్ల వ్యవస్థలకు చెడ్డ పేరు వస్తుంది.

# ఆర్టీసీ విలీనానికి బ్రేక్ పడినట్టేనా...



విజయవాడ, జూన్ 29, జగన్ వాగ్దానాలన్నీ అమలు చేస్తున్నానని చెప్పుకుంటారు. కానీ వాస్తవంగా ఆయన చేసేది అంతా జగన్మాయ మాత్రమే. అమ్మ ఒడి అన్నారు. తీరా లబ్ధిదారుల సంఖ్యను సగానికి సగం తగ్గించేశారు. ఒంటరి మహిళలకు పింఛన్ అన్నారు. అమలులోకి వచ్చే సరికి వయస్సు నిబంధనతో లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా కుదించారు. ఇలా ఏ పథకం తీసుకున్నా.. ఏ సంక్షేమం తీసుకున్నా అదే తీరు, అదే రీతి. దుల్హన్ పథకం దగ్గరకు వచ్చే సరికి గత ప్రభుత్వం ముస్లిం మహిళల వివాహానికి రూ. 50 వేలు ఇచ్చింది...తాను అధికారంలోకి వస్తే లక్ష ఇస్తానని గత ఎన్నికలకు ముందు జగన్ వాగ్దానం చేశారు. అయితే తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు నిధుల కొరత సాకు చూపుతూ ఆ పథకానికే మంగళం పాడేశారు.తాజాగా ఆర్టీసీ విలీనం విషయంలోనే జగన్ మాట తప్పారు. మడమ కూడా తిప్పేశారు. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని వైసీపీ ప్రకటించింది. జగన్ సీఎం అయిన తర్వాత సాంకేతిక సమస్యలు ఉన్నాయని కేవలం ఉద్యోగుల్ని మాత్రమే ప్రజా రవాణా శాఖ అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసి విలీనం చేసింది. ఆర్టీసీ మాత్రం అలాగే కొనసాగుతోంది. తాజాగా ఆర్టీసీ మొత్తాన్ని లీజుకు తీసుకోవాలని నిర్ణయించింది. మళ్లీ లీజు ఏమిటి? ప్రభుత్వంలో విలీనం చేయొచ్చు కదా అంటే మాత్రం సాంకేతిక సమస్యలంటూ నీళ్లు నములుతోంది జగన్ ప్రభుత్వం. అంతే కానీ ఆ సాంకేతిక సమస్యలేమిటన్నది మాత్రం చెపపడం లేదు. అయితే ఇప్పుడు హఠాత్తుగా లీజు వ్యవహారాన్ని తెరైకి తీసుకు వచ్చి పూర్తి చేయడానికి తొందరపడుతోంది. అయితే అదేమీ ఆర్టీసీ మీద ప్రేమతో కాదు.. కేంద్రానికి జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేకుండా తప్పించుకోవడానికేనని అంటున్నారుఆర్థిక రంగ నిపుణులు. వారికి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. కానీ వారు పని చేస్తోంది మాత్రం వేరే సంస్థగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీలోనే. అంటే ఆర్టీసీ ప్రభుత్వోద్యోగులుగా మారిన తమ పాత ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటోందన్నమాట. అందుకు గానూ జీఎస్టీ చెల్లించాలి. ఈ జీఎస్టీని చెల్లించకుండా ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం ఇప్పుడు ఆర్టీసీ లీజు అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చింది. అయితే ఇక్కడో రహస్యం ఉంది.ఆర్టీసీని విలీనం చేసుకుంటే ఈ లీజు గొడవ ఉండదుకదా అంటే.. నిపుణులు ఏం చెబుతున్నారంటే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకుంటే.. ఆర్టీసీ అప్పుల భారం కూడా ప్రభుత్వానికి విలీనం అయిపోతుంది. అదంతా ప్రభుత్వం కట్టాల్సి ఉంటుంది. అలాగే ఆర్టీసీలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉంది. అంటే విలీనానికి కేంద్రం అంగీకరించాలి. అలా కేంద్రం అంగీకారం తెలిపితే మొదట కేంద్రం చేసే పని తన వాటాను ఉపసంహరించుకోవడం. అదీ ప్రభుత్వానికి ఆర్థిక భారమే అవుతుంది. అందుకే ఈ బేడదలు.. కాదు కాదు బాధ్యతలేమీ తీసుకోకుండా లీజుతో సరిపెట్టేయాలని జగన్ సర్కార్ మాస్టర్ ప్లాన్ వేసింది.

# దుల్హాన్ పథకాన్ని అమలు చేయాలి..



**ముస్లిం మైనారిటీలకు ఉన్నత చదువులకు నిధులు కేటాయించాలి..**

**మజూను లకు జీతాలు ఇవ్వాలి.**

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం భాష**

బద్వేలు కడప జిల్లా బద్వేల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం భాష మాట్లాడుతూ దుల్హన్ పథకాన్ని అమలు చేయాలని. ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఉన్నత చదువులకు నిధులు కేటాయించాలని. మోజోన్లకు జీతాలు అందే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గత ప్రభుత్వంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పెళ్లి గాను మహిళలకు 25 వేల రూపాయలు అందించే పథకం తరువాత వచ్చినటువంటి టిడిపి హయాంలో 50 వేలుగా చేసి దుల్హన్ పథకంగా మార్చడం జరిగిందని కాగా 2019లో ప్రస్తుతం ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో దుల్హన్ పథకానికి గాను లక్ష రూపాయలు ఇస్తానని మాట ఇచ్చి నేడు మాట తప్పి పథకాన్ని రద్దు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ పథకం వల్ల నిరుపేద ముస్లింలు పెళ్లిళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని అటువంటి పథకం నేడు రద్దు చేయడం శోచనీయమని. ముస్లిం మైనారిటీల మనోభావాలను దెబ్బతీయడమేనని వారన్నారు. అనంతరం ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షులు ఎస్ ఏ సత్తార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని. దుల్హన్ పథకానికి లక్ష రూపాయలు ఇస్తానని మూడు సంవత్సరాలు గడిచిన ఒక్కరికి కూడా ఈ పథకం వర్తింప చేయలేదు గాని నేడు పథకాన్ని రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే దులహన్ పథకాన్ని అమలు చేయాలని వారు తెలిపారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ పి సి సి సెక్రెటరీ షేక్ ఇమామ్ సాహెబ్( బాబు) మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామని చెప్పి నేడు ప్రత్యేక హోదా ఊసే లేదని అదే తరహాలో ముస్లింలకు ఉన్నటువంటి పథకాలను వైదొలిగించి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు . మాట తప్పని మనమతిప్పని ముఖ్యమంత్రి నేడు ముస్లిం మైనారిటీలకు మాట తప్పడం కాదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీ విద్యార్థులకు విదేశీ లలో ఉన్నత చదువులకు గాను నిధులు ఇస్తామని చెప్పి దానిని కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అచ్యుతరాజు. పట్టణ మైనారిటీ అధ్యక్షులు పై రోజ్. కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ నాయకులు ఛార్జింగ్. మహిరు షమీర్.రఫీ. అహ్మద్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కడప కడప కార్పొరేషన్ ఎదుట మునిసిపల్ కార్మికులు,యూనియన్ నాయకులు, మహిళా కార్మికులు, రిలే నిరాహార దీక్షలు చేపట్టారు బుధవారానికి మూడవ రోజుకు చేరుకున్న సందర్భంగా మున్సిపల్ యూనియన్ నగర నాయకులు కే సుబ్బరాయుడు దీక్ష ను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగులో ఉన్న హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని ఇంజినీరింగ్ సెక్షన్ వారికి జీవో నెంబర్ 7 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. వర్కర్స్ ను పెంచి పనిభారం తగ్గించాలన్నారు కె ఎల్ ఎపి ఆటో డ్రైవర్ లకు పెండింగులో ఉన్న వేతనాలను చెల్లించాలకోరారు మేనేజర్ ను సస్పెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు70సం లుగా నగర ప్రజలకు సేవలందించిన, అందిస్తున్న మునిసిపల్ కార్మికుల కు పాత ఎక్స్ నోరా స్థలాన్ని కమ్యూనిటీ హాల్ (ఫంక్షన్ హాల్)గా ఇవ్వాలన్నారు కోవిడ్ కార్మికులను ఆప్కోస్ లో విలీనం చేయాలని పిఎఫ్, ఈ ఎస్ ఐ సమస్యలు పరిష్కరించా లన్నారు పర్మినెంట్ ఉద్యోగుల కు హెల్త్ కార్డులు,సి,పి,యస్,కార్డులు ఇవ్వాలని.పాత మస్టర్ విధానం అమలు చేయాలనికోరారు. నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం, పీఫ్,ఈ ఎస్ ఐ సంబంధించిన ఇన్సూ రెన్స్ డబ్బులు ఇప్పించాలని 11 ,గత 20 సం, లుగా నగర ప్రజలకు సేవలందించిన రిక్షా కార్మికుల ను తొలగించా కుండా వారికి ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. ఈ సమస్యలను చాలా కాలంగా పరిష్కరించక పోవడం వల్లనే కార్మికులు ఆందోళన బాట పట్టెరని ఈ ప్రభుత్వానికి మునిసిపల్ కార్మికుల పట్ల పక్షపాత ధోరణిలో వ్యవహరిస్తూన్నరని ఎంత దారుణంగా ఉంది అంటే ×2సం,, లు సర్వీసు లేనిసచివాలయం సెక్రటరీలు సిబ్బంది ని పెర్మినెంట్ చేయడం కార్మికుల ను ఏంతో బాధిస్తుందిదాదాపుగా 30సం,, పైబడి రాలుగా ఔట్సోర్సింగ్ పేరుతో సేవలు అందిస్తున్న మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేయక పోవడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తు కార్మికులు నేటినుండి శాంతి యుతంగా జరుగబోవు రిలే దీక్షలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని అలాగే 1వతేదీన జరుగబోవు కార్పొరేషన్ ఆఫీసు ముట్టడి కార్యక్రమన్ని జయప్రదం చేయాలని కోరారు. దీక్షలో కూర్చున్న వారు ఆరోగ్యమ్మ దావీదు వై కుమారు చిన్నస్వామి రాముడు ఈకార్యక్రమం సుంకర రవి అధ్యక్షత వహించారు ఇత్తడి ప్రకాష్, రమదేవి,లక్మి దేవి, పెంచాలమ్మ, ధరణి,ఆరోగ్యమ్మ సుంకర కిరణ్,పీవీ సుబ్బయ్య కుమార్, , పినాగరాజు, పెంచలయ్య, ప్రసాద్,శేఖర్, సుబ్బారాయు డు,పుల్లయ్య, వై రమేష్ ఓ ఆదాము ఏం పెంచలయ్య పి పుల్లయ్య పెద్ద ఎత్తున కార్మికులు హాజరయ్యారు

# మార్లేరు లో ఎమ్మెల్యే పర్యటన

ఆచంట దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంత భారీస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదిం చాలని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. మార్లేరు గ్రామం "లో ఆయన ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అవ్వతాతలను, మహిళలను రైతులను ఆయన ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.ప్రభుత్వ పనితీరు, పథకాల అమలుతీరుపై ఆరా చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా. వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన సున్నా వడ్డి తదితర పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి 3 ఏళ్లలో పూర్తి స్థాయిలో సంక్షేమ పదకాలను అమలు చేశారని అన్నారు.సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు రూపొందించి ముందుగా నిర్దేశించిన తేదీల్లో పథకాలకు సంబంధించిన నగదును బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను, తెలియజేయడంతో పాటు ప్రజల సమస్య లను తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో గడపగ డవకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరంగనాధరాజు చెప్పారు. గ్రామంలో అడుగడుగునా ఎమ్మెల్యే శ్రీరంగనాడ రాజుకు మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర జెడ్పిటీసీ కర్రీ గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయ అరెడ్డి (వాసు), సర్పంచ్ మట్టా కుమారి, ఉపన ర్పంచ్ కర్రీ వేణుబాబు, కొవ్వూరి వేణుమాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం

ఆస్టరాయిడ్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 30న నిర్వహిస్తారు. 1908, జూన్ 30న రష్యా సమాఖ్య, సైబీరియాపై తుంగస్కా గ్రహశకలం ప్రభావంకు గుర్తుగా, గ్రహాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంతో ఈ దినోత్సవం జరుపుతారు. ఇటీవలికాలంలో భూమిపై అత్యంత హానికరమైన గ్రహశకలానికి సంబంధించినత సంఘటన ఇది. 1908, జూన్ 30న రష్యాలోని సైబీరియా స్టోనీ తుంగుస్కా నది సమీపంలోని భూమిని అతిపెద్ద గ్రహశకలం ఢీకొట్టడంతో దాదాపు 2,072 చ.కి.మీ. విస్తీర్ణంలో అటవీ ప్రాంతం నాశనమైంది. దానికి గుర్తుగా జూన్ 30న అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవంగా జరుపుతున్నారు. ఐక్యరాజ్యసమితి తన తీర్మానంలో ప్రతి సంవత్సరం జూన్ 30 న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించింది. గ్రహశకలం దినాన్ని స్టీఫెన్ హాకింగ్, చిత్రనిర్మాత గ్రిగోరిజ్ రిక్టర్స్, బి 612 ఫౌండేషన్ ప్రెసిడెంట్ డానికా రెమి, అపోలో 9 వ్యోమగామి రస్టీ ష్వీకార్ట్, క్వీన్ గిటారిస్ట్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త బ్రియాన్ మే కలిసి స్థాపించారు. రిచర్డ్ డాకిన్స్, బిల్ నై, పీటర్ గాబ్రియేల్, జిమ్ లోవెల్, అపోలో 11 వ్యోమగామి మైఖేల్ కాలిన్స్, అలెక్సీ లియోనోవ్, బిల్ అండర్స్, కిప్ థోర్న్, లార్డ్ మార్టిన్ రీస్, క్రిస్ హాడ్ఫీల్డ్, రస్టీ ష్వీకార్ట్, బ్రియాన్ కాక్స్ సహా 200 మంది వ్యోమగాములు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, కళాకారులు గ్రహశకల దినోత్సవ ప్రకటనకు సంతకాలు చేశారు. 2014, డిసెంబరు 3న ఈ అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం అధికారికంగా ప్రారంభించబడింది. 2014, ఫిబ్రవరిలో రాక్ బ్యాండ్ క్వీన్ కోసం ఖగోళ భౌతిక శాస్త్రవేత్త, గిటారిస్ట్ బ్రియాన్ మే 51 డిగ్రీ నార్త్ చిత్రానికి దర్శకుడు గ్రిగోరిజ్ రిక్టర్స్ తో కలిసి పనిచేయడం ప్రారంభించాడు. లండన్ పై కల్పిత ఉల్క ప్రభావ సంఘటన ఫలితంగా ఏర్పడిన మానవ పరిస్థితుల నేపథ్యంతో రూపొందించిన ఈ చిత్రానికి బ్రియాన్ మే సంగీతం సమకూర్చాడు. ఈ చిత్రాన్ని 2014 స్టార్మస్ ఫెస్టివల్లో ప్రదర్శించిన తరువాత రెమి, ష్వీకార్ట్, రిక్టర్స్, మే కలిసి 2014, అక్టోబరులో ఈ దినోత్సవాన్ని స్థాపించి.. లార్డ్ మార్టిన్ రీస్, రస్టీ ష్వీకార్ట్, ఎడ్, థామస్ జోన్స్, రియాన్ వాట్, బిల్ నై విలేకరుల సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమం లండన్ లోని సైన్స్ మ్యూజియం, కాలిఫోర్నియా అకాడమీ ఆఫ్ సైన్సెస్, న్యూయార్క్, సావో పాలో నుండి ప్రత్యక్షప్రసారం చేయబడింది. 2017 గ్రహశకలం దినోత్సవం రోజున, మైనర్ గ్రహం 248750 ను అంతర్జాతీయ ఖగోళ యూనియన్ అధికారికంగా గ్రహశకలం అని పిలిచింది. ఈ దినోత్సవం రోజున గ్రహశకలాల స్థితిన గమనించి భూమిని, భవిష్యత్ తరాలను ఆయా విపత్తు సంఘటనల నుండి రక్షించడానికి చేయవలసిన కార్యకలాపాల గురించి చర్చలు జరుపుతారు.

## వజ్రకొత్తూరులో వజ్రాలు

కర్నూలు, జూన్ 29, తొలకరి జల్లులు పడ్డాయంటే చాలు కర్నూలు జిల్లాలోని పొలాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. ముఖ్యంగా జొన్నగిరి,పగిడిరాయి,ఎర్రగుడి,మద్దికెర ప్రాంతాల్లోని ఎర్ర నేలల్లో వజ్రాల వేట ఎక్కువగా ఉంటుంది. కుటుంబ సమేతంగా చాలామంది ఇక్కడి పొలాల్లో వజ్రాన్వేషణ కొనసాగిస్తారు. మంగళవారం వజ్రాల వేటకు వెళ్లిన రైతుకు రెండు వజ్రాలు దొరికినట్టు తెలుస్తోంది. తుగ్గలి మండలంలోని గిరిగెట్లలో రైతులకు ఈ వజ్రాలు దొరికినట్టు సమాచారం.



పొలంలో పనిచేస్తుంటే రైతులకు రెండు వజ్రాలు దొరికాయని, ఇందులో ఒక వజ్రాన్ని రూ 2.5 లక్షల నగదు, 2 తులాల బంగారానికి, మరో వజ్రాన్ని రూ. 15 వేలకు వజ్రాల వ్యాపారులు కొనుగోలు చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.గతంలోనూ ఇక్కడి పొలాల్లో చాలామందికి వజ్రాలు లభించాయి. ఇటీవల ఓ రైతుకు రూ.1కోటి పైచిలుకు విలువ చేసే వజ్రం దొరికింది. గత మే నెల 17వ తేదీన చిన్నజొన్నగిరి ప్రాంతానికి చెందిన ఓ మహిళకు 30 క్యారెట్ల వజ్రం దొరికింది. ఆ మరుసటిరోజే మరో మహిళకూ వజ్రం లభించింది.ఇదిలా ఉంటే, రైతులకు దొరికిన వజ్రాలను స్థానిక వ్యాపారులు తక్కువ ధరకే వాటిని కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో రూ.కోట్ల విలువ చేసే వజ్రాలను ఇలా తక్కువ ధరకే కొనుగోలు చేసి అమాయకులను దోపిడీ చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

## 3న జనవాణి

విజయవాడ, జూన్ 29, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా.. సామాన్యుడి గళం వినబడేలా జనసేన పార్టీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సామాన్యుడి గళం వినిపించేలా 'జన వాణి' పేరిట వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసింది. ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ 'జన వాణి' అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పవన్ కల్యాణ్ వరుసగా వచ్చే ఐదు ఆదివారాలు ప్రజలకు ప్రత్యక్షంగా అందుబాటులో ఉండి.. బాధిత పక్షాల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరిస్తారు.తొలి రెండు ఆదివారాలు విజయవాడలో జన వాణిని నిర్వహిస్తారు. జులై 3న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో తొలి విడత 'జన వాణి' ప్రారంభమవుతుంది. విజయవాడలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పవన్ కళ్యాణ్ ప్రజలకు అందుబాటులో ఉంటారు. తర్వాత ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉభయగోదావరి ప్రాంతాల్లో జన వాణి ఉంటుంది. అంతేకాదు.. అదే రోజు సాయంత్రానికి ఆ సమస్యలను సంబంధిత అధికారులకు చేరేలా ప్రయత్నిస్తారు. మరుసటి రోజు తమ కార్యాలయం నుంచి ఆ అర్జీల పురోగతిని ఫాలో అప్ చేస్తారు. రాజకీయాలకు అతీతంగా, సామాన్యుడికి న్యాయం జరిగే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. పవన్తో సమస్యని చెప్పుకుంటే తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని తెలిపారు.



# ప్రభుత్వాలపై ఉద్యమాల ద్వారా బుద్ధి చెబుదాం..

## సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు



నంద్యాల :- దేశ రాష్ట్రాలలో ప్రజలపై పన్నుల భారం వేసి దోపిడి చేస్తూ కార్పొరేట్ శక్తులకు ప్రజాధనాన్ని దోచి పెడుతున్న ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజా ఉద్యమాల ద్వారా తగిన బుద్ధి చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె రామాంజనేయులు పిలుపునిచ్చారు.మహానంది లో బుధవారం నాడు సిపిఐ మండల మహాసభలు స్థానిక కళ్యాణమండపంలో మండల కార్యదర్శి ఆర్.సామేలు అధ్యక్షతన జరిగినవి. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు. సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి. ఎన్. రంగ నాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు. కే ప్రసాద్. ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధి పొంది అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రాష్ట్రాల్లో మత విధ్వంసం ద్వారా అధికారం చేజిక్కించుకున్న తర్వాత పెట్రోలు. డీజిల్.వంటగ్యాస్. నిత్యావసర ధరలు పెంచడం ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన పట్టించుకోకుండా మోసపూరిత పాలన నిర్వహిస్తున్నది విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగ నాయుడు మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి తన తండ్రి వైయస్ రాజశేఖర రెడ్డి పాలన అందిస్తారని ప్రజలు ఎంతో ఆశతో అధికారం అందిస్తే కేంద్ర ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తూ కరెంటు చార్జీలు. బస్సు చార్జీలు. పన్ను ఛార్జీలు రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లలో బిగిస్తూ రైతు వ్యతిరేక ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని అమ్మ ఒడి అంటూ మహిళలకు 13000వేలు ఇస్తూ నాన్న బుడ్డి ద్వారా 54 వేల రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ మహానంది మండలం లో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరిగానే ఉన్నాయని వాటి పరిష్కారానికి స్థానిక శాసనసభ్యులు ఏ మాత్రం చొరవ చూపకుండా పరిష్కారం చేయకుండా గడపగడపకు వైఎస్సార్ ప్రభుత్వం అంటూ సిగ్గుతో ప్రజల మధ్యకు వెళ్లడం విచారకరమని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపైప్రజా ఉద్యమాలు నిర్వహించేందుకు ఎర్రజెండా చేతపట్టి ప్రజలందరూ సన్నద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ మండల కమిటీ కార్యదర్శిగా వీరప్ప. సహాయ కార్యదర్శులు గా మహేశ్వర్ మ్మ తుపాకుల వెంకటేశ్వర్లు తో పాటు 15 మంది సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నారాయణ. సుబ్బరాయుడు.వరదరాజులు. వీరప్ప. గురుమూర్తి.తుపాకుల వెంకటేశ్వర్లు. ఆంజనేయులు. మద్దిలేటి తిరుపాలు బుక్కాపురం రామేశ్వర అయ్యా దీనా వలి.మహేశ్వరమ్మ. వెంకటమ్మ లక్ష్మీదేవి. బుక్కాపురం పార్వతి మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని గ్రామ సచివాలయం నందు ఒక్కరోజు పాటు నిర్వహించిన ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ముగిసినట్లు డిజిటల్ అసిస్టెంట్ అశోక్ మరియు వెల్ఫేర్ అసిస్టెంట్ పులి శేఖర్ లు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక్కరోజు ఆధార్ స్పెషల్ డ్రైవ్ ను 30 మంది లబ్ధిదారులు



వినియోగించుకున్నారని వారు తెలియజేశారు .ఇందులో 17 మంది బయోమెట్రిక్ అప్డేట్,3 అడ్రస్ మార్పు,10 మంది మొబైల్ నెంబర్లు లింకు చేసుకున్నారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్,గ్రామ వాలంటీర్లు మరియు గ్రామ సచివాలయం ఉద్యోగులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు చెరువు పునరుద్ధరణతో..రైతులకు ఎంతో మేలు చినలబుడు పంచాయతీ, మాలసింగారం గ్రామానికి చెందిన 1.24 ఎకరాల విస్తీర్ణంలో జిన్ను నాయుడు చెరువు పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 7,58,044 రూపాయల చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించేందుకు మాలసింగారం గ్రామానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గ్రామ మహిళలు స్వాగతం పలికారు నాయకులు అధికారులతో కొబ్బరికాయ కొట్టి గ్రామ చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించారురాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తూనే ప్రజా మౌలిక సదుపాయాలను తీస్తున్నారని ఆయన అన్నారు రానున్నది వర్షాకాలం కనుక వర్షం నీరు వృధా కాకుండా ఉండేందుకు చెరువులను నిర్మించి తద్వారా వర్షపు నీటిని నిల్వ చేసే ప్రక్రియగా చెరువుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఖరీఫ్ రబీ పంట పండించే రైతులకు నీటి అవసరాలను తీర్చేందుకు చెరువుల మరమ్మతులు సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభించటం రైతులకు ఆనందాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు, చెరువు పునరుద్ధరణ పనులు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామస్తులు ఆర్థికంగా బలపడే విధంగా రాష్ట్రప్రభుత్వం చెరువు పునరుద్దరణతో పనిదినాల వెసులుబాటును కల్పించిందని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ: గరం సీత స్థానిక సర్పంచ్: బురిడీ



ఉపేంద్ర, పద్మాపురం సర్పంచ్ పెట్టేలి సుష్మిత వైస్ ఎంపీపీ: కిల్లో రామన్న, వైసీపీ మండల అధ్యక్షులు: కొర్రా గాసి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పాడి రమేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు: లోక్కోయి లక్ష్మణ్ కుమార్, పానిరంగిని వార్డు సభ్యులు: లబుడుబారికి కిరణ్ కుమార్, యువజన విభాగ నాయకులు: మొశ్యా రంజిత్ కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు: ×సమర్డీ రఘునాథ్, ఎం టి ఆర్ సాంబా ఎంపీడీఓ రాంబాబు, ఎమ్మార్వో: వేణుగోపాల్, ఏపీఓ సత్యనారాయణ, వీఆర్వో: పంచాడీ లింగమూర్తి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ గ్రామస్థులు పాల్గొన్నారు

# జగన్మోహన్ రెడ్డి నందికొట్కూరు నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి సారించారు... ఆర్థర్

నందికొట్కూర్(జూన్:30) ప్రియతమ ముఖ్యమంత్రి నందికొట్కూరు నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి సారించారని. నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధి ముందుకు దూసుకుపోతుందని బుధవారం నాడు నందికొట్కూరు పట్టణంలోని చాముండి గార్డెన్లో వైసిపి నియోజకవర్గస్థాయి ప్లీనరీ సమావేశాలు నిర్వహించారు.. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆర్థర్ మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గాన్ని అదేవిధంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని గుండెల్లో పెట్టుకొని చూస్తాను అని చెప్పిన మాట ప్రకారం.. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కి రెండు రాష్ట్ర స్థాయి పదవులను ఇవ్వడం సంతోషకర మైన విషయమని అన్నారు.. మన రాష్ట్ర ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవరత్నాల్లో భాగంగా 16 రత్నాలుగా ప్రజలకు లబ్ధి పొందే పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. పిల్లల చదువుల నుండి నిరుపేదలకు జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను విడుదల చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామ వాలంటరీ వ్యవస్థ. సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాక సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం కూడా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం మా ప్రియతమ యువ నాయకుడు సిద్ధార్థ రెడ్డి సహాయ సహకారాలతో ఈరోజు నందికొట్కూరు నియోజకవర్గం లోని 6 మండలాలలోని ఎంపీటీసీలు. జడ్పీటీసీలు. ఎంపీపీ. కౌన్సిలర్లను. వార్డ్ మెంబర్ ర్లతో సహా వైయస్సార్ పార్టీ భారీ మెజారిటీతో గెలిపించడం జరిగిందన్నారు.. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పేరు చెప్పగానే చాముండి ఫంక్షన్ హాల్లో ప్లీనరీ సమావేశం లో ఉన్నటువంటి వేలది మంది జన సందోహం హర్షధ్వానాలతో హోరెత్తించారు.. ప్లీనరీ సమావేశానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి. మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డి. మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్న మల్లారెడ్డి. మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి. పగిడ్యాల జడ్పిటిసి పుల్యాల దివ్య. కొత్తపల్లి మండలం. పాములపాడు మండలం. జూపాడు బంగ్లా మండలం. మిడుతూరు మండలం. పగిడ్యాల. నందికొట్కూర్ మండలాల జడ్పిటిసిలు. ఎంపీటీసీలు. ఎంపీపీలు. సర్పంచులు. ప్లీనరీ సమావేశాలకు హాజరయ్యారు. శ్రీనంది కాలేజ్ అధినేతలు శ్రీకాంత్. బసిరెడ్డి కాలేజ్. సూది రెడ్డి రమేష్ రెడ్డి. శివారెడ్డి. బూసి రెడ్డి. కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ చందమాల బాలస్వామి. నాగటూరు సుధాకర్ రెడ్డి. లక్ష్మాపురం సిరిగిరి వెంకట్. ప్రాతకోట ఎర్రం వెంకటరెడ్డి. పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వైయస్సార్ సిపి పార్టీ ప్లీనరీ సమావేశానికి 12వ వార్డు కౌన్సిలర్ లాలూ ప్రసాద్ గారి ఆధ్వర్యంలో మారుతీ నగర్ నుండి స్థానిక మున్సిపల్ ఆఫీస్ వరకు ఆటో మరియు బైక్ లతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.. . ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూధన్ రెడ్డి, ముచ్చుమర్రి భాషా, ఏసన్న, చరణ్ తేజ, యోసేపు, ప్రభాకర్, రబ్బానీ, జేమ్స్, మనోహర్, రమణ, తదితరులు పాల్గొనడం జరిగింది. నందికొట్కూరు నియోజకవర్గ వైసిపి ప్లీనరీ సమావేశాలకు హాజరైన నాయకులు కార్యకర్తలు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నందికొట్కూరు రూరల్ సిఐ సుధాకర్రెడ్డి ఆధ్వర్యంలో నందికొట్కూరు ఎస్సై వెంకటరమణ. ముచ్చుమర్రి ఎస్సై నాగార్జున. పాములపాడు ఎస్సై అశోక్. జూపాడు బంగ్లా. ఎస్సైలు. పోలీస్ సిబ్బంది ప్రత్యేక బంధవస్తు ఏర్పాటు చేశారు.

# కలీముల్లా ఆత్మహత్యకు కారణమైన ఆర్టీఓ అధికారులను కఠినంగా శిక్షించాలి

## తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ డిమాండ్

నంద్యాల్ :- నంద్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నాడు తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో కరిముల్లా ఆత్మహత్య కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆర్టీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మరియు రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ మట్లాడుతూ కరిముల్లా ఆత్మహత్య చేసుకొని 22 రోజులు అయినా దోషులకు ఎందుకు ఇప్పుడు వరకు అరెస్టు చేయడం లేదని మూలానా ముస్తాక్ అహ్మద్ ప్రశ్నించారు . కరీముల్లా ఆత్మ హత్యకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు .

# మెగా హీరోలతో చేశాను .. మెగా హిట్లు కొట్టాను!

మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన వైష్ణవ్ తేజ్ ఒక్కో ప్రాజెక్టును లైన్లో పెడుతున్నాడు. ఆయన తాజా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి 'రంగ రంగ వైభవంగా' రూపొందింది. గిరిశాయ దర్శకత్వం వహించిన ఈ సినిమాకి బీవీఎస్ ఎన్ ప్రసాద్ నిర్మాతగా వ్యవహరించారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకి సంగీతాన్ని అందించాడు. కొంత సేపటి క్రితం ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ఈ వేదికపై నిర్మాత బీవీఎస్ ఎన్ ప్రసాద్ మాట్లాడారు."మెగా ఫ్యామిలీలోని అందరితోనూ నేను సినిమాలు చేశాను. అలాగే వైష్ణవ్ తేజ్ తోను ఈ సినిమా చేశాను. అన్నీ హిట్ అయినట్టుగానే ఈ సినిమా కూడా పెద్ద హిట్ అవుతుందని భావిస్తున్నాను. ఈ సినిమాను కూడా మీరంతా ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చారు. గతంలో చరణ్ హీరోగా వచ్చిన 'మగధీర'కి ఆయన ఒక నిర్మాత. ఇక పవన్ కల్యాణ్ హీరోగా ఆయన నిర్మించిన 'అత్తారింటికి దారేది' .. వరుణ్ తేజ్ 'తొలిప్రేమ' ఎలాంటి సంచలనాలు సృష్టించాయో తెలిసిందే.ఇక ఈ సినిమా దర్శకుడు గిరీశాయ మాట్లాడుతూ .. "ఈ సినిమా నుంచి ఇంతవరకూ వచ్చిన ప్రతి అప్డేట్ కి మీ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అందుకు సపోర్ట్ చేసున్నా మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ రోజుల్లో ఒక హీరోను కలిసి కథ చెప్పడం చాలా కష్టం. కానీ వైష్ణవ్ తేజ్ నేను చెప్పిన కథ వినేసి వెంటనే ఓకే చెప్పారు .. నేను అక్కడి నుంచి వచ్చేస్తుంటే నా చేతిలో ఒక బాక్స్ పెట్టారు. ఇంటికి వెళ్లి ఓపెన్ చేస్తే అందులో చాక్ లెట్స్ ఉన్నాయి. మెగా ఫ్యామిలీ నుంచి మా ఇంటికి వచ్చిన ఫస్టు గిఫ్ట్ అది.మా ఇంట్లో మేమంతా మెగా స్టార్ అభిమానులం .. అందువలన ఆ రోజంతా మా ఇంట్లో ఎవరూ నిద్రపోలేదు. సాంగ్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. వైష్ణవ్ లుక్ అదిరిపోయింది అంటూ అంతా చెప్పారు. ఈ సినిమాలో ఆయన చాలా కొత్తగా కనిపిస్తారు .. ఆయన ఎనర్జీ నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆయన ఎనర్జీనే ఈ సినిమా. ఇందులో కథానాయిక పేరు రాధ. ఆ పాత్ర కోసం చాలామందిని అనుకున్నాము. కేతిక కళ్లు చూడగానే నాకు రాధ దొరికేసిందని అనుకున్నాను. ఈ సినిమా తన కెరియర్ కి తప్పకుండా హెల్ప్ అవుతుంది" అని చెప్పుకొచ్చాడు.




# స్వాతిముత్యం ఫస్ట్ సింగిల్...కెమిస్ట్రీ అదిరింది

స్టార్ ప్రొడ్యూసర్ బెల్లంకొండ సురేష్ చిన్న కుమారుడు బెల్లంకొండ గణేష్ హీరోగా పరిచయం అవుతున్న లేటెస్ట్ మూవీ 'స్వాతిముత్యం'. వర్ష బొల్లమ్మ హీరోయిన్. హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా ఈ మూవీని రూపొందిస్తున్నారు. సితార ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ లవ్ స్టోరీ ద్వారా లక్ష్మణ్ కె. కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ఈ మూవీ టీజర్ ని మేకర్స్ విడుదల చేశారు. టీజర్ వెరైటీగా వుండటంతో సినిమాకు మంచి బజ్ క్రియేట్ అయింది.సినిమా రిలీజ్ కు రెడీ కావడంతో చిత్ర బృందం తాజాగా ప్రమోషన్స్ ని ప్రారంభించారు. టైటిల్ ప్రకటించిన దగ్గరి నుంచి టీజర్ రిలీజ్ వరకు ఈ మూవీపై చాలా వరకు పాజిటివ్ బజ్ నడుస్తోంది. పైగా బెల్లంకొండ గణేష్ తొలి మూవీనే ఇలా విభిన్నమైన కథని ఎంచుకోవడం పలువురిని ఆకట్టుకుంటోంది. అంతే కాకుండా కొత్త తరహా కథలకే తన ప్రాధాన్యత అంటూ తొలి చిత్రంతోనే గణేష్ క్లారిటీగా వస్తున్నాడని ఇలా చేస్తే హీరోగా లాంగ్ రన్ లో వుండాలని కూడా కామెంట్ లు మొదలయ్యాయి.ఇదిలా వుంటే ఈ మూవీ ప్రమోషన్స్ ని ప్రారంభించిన మేకర్స్ తాజాగా సోమవారం ఫస్ట్ సింగిల్ 'నీ చారెడు కళ్లే.. ' అంటూ సాగే లిరికల్ వీడియోని విడుదల చేసింది. మహతి స్వరసాగర్ స్వరాలు అందించగా కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. అర్మాన్ మాలిక్ సంజనా కల్మాంజే ఆలపించిన పూర్తి సాంగ్ ని తాజాగా విడుదల చేశారు. ఈ పాటలో బెల్లంకొండ గణేష్ వర్ష బొల్లమబ్మల మధ్య కుదిరిన కెమిస్ట్రీ అదిరింది. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ మూవీకి వీరిద్దరి మధ్య కుదిరిన కెమిస్ట్రీ ప్రధాన హైలైట్ గా నిలవబోతోంది.రొటీన్ లవ్ స్టోరీలకు కాస్త భిన్నంగా సున్నితమైన భావోద్వేగాలని ప్రేమకథకు జోడించి దర్శకుడు ఈ మూవీని తెరకెక్కించినట్టుగా తెలుస్తోంది. ఇప్పటికే టీజర్ తో మంచి బజ్ ని క్రియేట్ చేసుకున్న ఈ మూవీని ఆగస్టు 13న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. మహతి స్వరసాగర్ అందించిన సంగీతం ప్రధాన బలంగా నిలవనున్నఈ మూవీలో రావు రమేష్ సుబ్బరాజువెన్నెల కిషోర్ సప్తగిరి హర్షవర్ధన్ పమ్మిసాయి గోపరాజు రమణ శివనారాయణ సురేఖా వాణి సునైనా దివ్యశ్రీపాద తదితరులు నటిస్తున్నారు.




# పుష్ప ఐటెమ్ సాంగ్ పాడిన సల్మాన్.. సమంత లవ్లీ రియాక్షన్

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ని ఐకాన్ స్టార్ గా మార్చిన పుష్ప సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే ఈ సినిమా వచ్చి నెలలు గడుస్తున్నా కూడా ఇంకా ఏదో ఒక విషయం తో బాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారుతుంది. ముఖ్యంగా బాలీవుడ్ ఇండస్ట్రీలో అయితే ఈ సినిమా గురించి సినీ తారలు కూడా ఏదో ఒక విధంగా స్పందిస్తూ ఉండడం విశేషం. నార్త్ జనాలకు ఇప్పటికే పుష్ప సినిమా చాలా బాగా ఎక్కేసింది.అల్లు అర్జున్ మ్యానరిజం అలాగే సినిమాలోని పాటలు డైలాగ్స్ ఇలా అన్ని రకాలుగా సోషల్ మీడియా లో ఏదో ఒక బ్యాక్ అయితే క్రియేట్ చేస్తూనే ఉంది. ఈ బజ్ అయితే పుష్ప సెకండ్ పార్ట్ వచ్చే వరకు ఉంటుంది అని అనిపిస్తోంది. ఇక రీసెంట్ గా బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ కూడా పుష్ప ఐటమ్ సాంగ్ పై స్పందించిన విధానం సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది.ఐఫా ఫిలిం ఫెస్టివల్లో పాల్గొన్న సల్మాన్ ఖాన్ అక్కడ ఇష్టమైన పాట గురించి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎక్కువగా ఊ అంటావా మామ అనే పాట చాలా బాగా నచ్చేసింది వివరణ ఇవ్వడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.ఇక సల్మాన్ కు సంబంధించిన వీడియో వైరల్ అవుతూ ఉండడంతో ఆ వీడియో పై సమంతా కూడా రియాక్షన్ ఇచ్చింది. లిటిల్ రెడ్ హార్ట్స్ తో అందుకు సంబంధించిన ట్వీట్లు రీట్వీట్ చేయడం విశేషం. ఏదేమైనా ఈ సినిమా బాలీవుడ్ ఇండస్ట్రీలో కూడా ఒక సంచలనం సృష్టించింది అని చెప్పాలి.కేవలం హిందీ లో నే ఈ సినిమా 100 కోట్ల నెట్ కలెక్షన్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.



# పాండ్యా నోటి వెంట సంజూ పేరు.. ప్రేక్షకుల కేరింతలు.. వీడియో వైరల్




సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐర్లాండ్ పర్యటనలో భాగంగా భారత జట్టులో తిరిగి చోటు దక్కించుకున్నాడు సంజూ శాంసన్. టీ20 సిరీస్ ఆడేందుకై హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఐర్లాండ్‌కు టూర్‌కు వచ్చిన జట్టులో భాగమయ్యాడు. ఈ క్రమంలో మొదటి మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితమైనా.. రెండో టీ20లో సంజూ తుది జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా దూరం కావడంతో అతడి స్థానంలో ఎంట్రీ ఇచ్చిన సంజూ.. అదిరిపోయే ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి ఓపెనింగ్‌కు దిగి 42 బంతుల్లో 77 పరుగులు చేశాడు. ఇందులో 9 ఫోర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన అద్భుత బ్యాటింగ్‌తో టీమిండియా విజయంలో కీలకంగా వ్యవహరించిన ఈ కేరళ బ్యాటర్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి.కాగా సంజూ రీ ఎంట్రీతో అభిమానులు ఎంత ఖుషీ అయ్యారో చెప్పేందుకు తార్కాణంగా నిలిచిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐర్లాండ్‌తో రెండో టీ20 ఆరంభానికి ముందు కెప్టెన్ హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ.. మూడు మార్పులతో బరిలోకి దిగినట్లు తెలిపాడు. గాయపడిన రుతు స్థానంలో సంజూ ఎంట్రీ ఇస్తున్నాడు అనగానే మైదానంలో ప్రేక్షకులు గట్టిగా అరుస్తూ తమ సంతోషాన్ని తెలియజేశారు.ఇందుకు స్పందించిన పాండ్యా సైతం సంజూ పేరు వినగానే అందరూ ఖుషీ అయి ఉంటారంటూ వ్యాఖ్యానించాడు. ఇదిలా ఉంటే.. ఈ మ్యాచ్‌లో ఆవేశ్ ఖాన్‌కు బదులు హర్షల్ పటేల్, యజువేంద్ర చహల్‌కు బదులు రవి బిష్ణోయి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ మ్యాచ్‌లో పాండ్యా సేన 4 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.కాగా సంజూ పునరామనానికి సంబంధించి హార్దిక్ మాట్లాడుతున్న వీడియోను షేర్ చేసిన రాజస్తాన్ రాయల్స్ తమ కెప్టెన్ పేరు వినగానే గూస్‌బంప్స్ వచ్చాయంటూ కామెంట్ చేసింది. ఇక ఐపీఎల్-2022 ఫైనల్లో హార్దిక్ పాండ్యా జట్టు గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమి పాలై రాజస్తాన్ రన్నరప్‌తో సరిపెట్టుకున్న విషయం తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**